సాక్షి
కామారెడ్డి
ఆదివారం ¦ 1 ¦ జూన్ ¦ 2025



వ్యసనాలకు దూరంగా ఉండాలి
ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.
- 9లో ▸



అంగన్‌వాడీ బాట..
ప్రతి గ్రామంలో ఆదివారం అంగన్‌వాడీ బాట నిర్వహించాలని ఐసీడీఎస్ బాన్సువాడ ప్రాజెక్టు సీడీపీవో సౌభాగ్య సూచించారు.
- 9లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.5 /23.4
ఆకాశం మేఘావృతమవుతుంది. ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రేపటి ప్రజావాణి రద్దు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ సోమవారం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని 25 వ రూమ్‌లో ఫిర్యాదులు అందించాలని సూచించారు. జూన్ 9 ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

నేటినుంచి రేషన్ బియ్యం పంపిణీ



ఎల్లారెడ్డిరూరల్ : వర్షాకాలంలో రేషన్ పంపిణీలో ఇబ్బందులను నివారించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఒకేసారి మూడు నెలల రేషన్ పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసింది. ఆహారభద్రత కార్డుదారులకు ఒక్కో యూనిట్‌పై 18 కిలోల చొప్పున బియ్యం అందించనున్నారు. మూడునెలలకు సంబంధించిన బియ్యం పంపిణీ ఆదివారం ప్రారంభం కానుంది. జూన్ నెలంతా బియ్యం పంపిణీ చేయనున్నట్లు డీఎస్‌వో మల్లికార్జున్ బాబు 'సాక్షి'తో తెలిపారు. మూడు నెలల కోటాను రేషన్ దుకాణాలకు పంపించడంలో కామారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో ఉందని పేర్కొన్నారు. కొన్ని రేషన్ దుకాణాలలో స్థలం కొరత ఉండడంతో వారికి అనుకూలంగా రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నామని తెలిపారు.

సీపీవోకు పదోన్నతి



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి(సీపీవో) రాజారాం పదోన్నతి పొందారు. ఆయన కరీంనగర్ జాయింట్ డైరెక్టర్‌గా వెళ్తున్నారు. రాజారాం 2021 మార్చిలో కామారెడ్డి జిల్లా సీపీవోగా బాధ్యతలు చేపట్టారు. నాలుగేళ్లకుపైగా ఆ బాధ్యతల్లో ఉన్నారు. ఆయన స్థానంలో రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న సుజాత పదోన్నతిపై రానున్నట్లు సమాచారం.

ట్రస్మా జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం



కామారెడ్డి టౌన్ : తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ట్రస్మా) జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా పున్న రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్, కోశాధికారిగా వీరాచారి, జిల్లా కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఎన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, రాష్ట్ర ముఖ్య సలహాదారులు కడారి అనంతరెడ్డి, చింతల రాంచందర్, కొమిరెడ్డి మారుతి తదితరులు పాల్గొన్నారు.

'అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తాం'

కామారెడ్డి టౌన్: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఈ శ్రవణ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలోగల విద్యుత్ మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్, జనరేటర్‌లను పరిశీలించారు. పవర్ జనరేటర్ ఆటోమోడ్ ఆపరేషన్, డీజిల్ లెవల్ వివరాలు తనిఖీ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో ఆస్పతిలో విద్యుత్ సరఫరాలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ ఫరీదాతో సమావేశమై ఆస్పత్రిలో విద్యుత్ సమస్యలపై చర్చించారు. ఆస్పత్రిలోని విద్యుత్ వైర్లను ఎలక్ట్రీషియన్‌లతో చెక్ చేయించి, అవసరమైన మరమ్మతులు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఈ కిరణ్‌కుమార్, పట్టణ ఏఈలు పాల్గొన్నారు.

నేడు తెరవే జిల్లా మహాసభ

కామారెడ్డి అర్బన్: జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో ఆదివారం ఉదయం 10 గంటలకు తెలంగాణ రచయితల వేదిక(తెరవే) జిల్లా రెండో మహాసభలు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి తెరవే రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డితో పాటు ఆచార్య జయధీర్ తిరుమలరావు, విమలక్క హాజరవుతారని తెరవే ప్రతినిధులు తెలిపారు.



చదువులమ్మ చెట్టు నీడలో..

- వేలాది మందిని తీర్చిదిద్దిన కామారెడ్డి డిగ్రీ కళాశాల
- ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ అధికారులుగా ఎందరో..
- దేశ, విదేశాల్లో ఉన్నత ఉద్యోగాల్లో పలువురు
- తెలంగాణ స్టేట్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్, రెరా చైర్మన్ ఇక్కడ చదివినవారే..

కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల రాష్ట్రంలో ఎక్కడా లేని ప్రత్యేక కోర్సులతో అలరారుతోంది. ఈ కళాశాలలో ఎక్కడెక్కడి నుంచో వచ్చిన విద్యార్థులు చదువుకున్నారు. చదువులమ్మ చెట్టు నీడలో తమ జీవితాలకు చక్కటి బాటలు వేసుకున్నారు. ఇక్కడ జీవిత పాఠాలు నేర్చుకుని మరెందరో ఉన్నత స్థానాలకు చేరారు. పలువురు దేశ, విదేశాల్లో ఉన్నతమైన స్థానాల్లో కొలువుదీరారు. ఆరు దశాబ్దాలలో వేలాది మందిని తీర్చిదిద్దిన కళాశాలపై సండే స్పెషల్..

సండే స్పెషల్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : 1964 సంవత్సరంలో అప్పటి కలెక్టర్ బీఎస్ రామన్ ఆలోచనలు, పట్టణ ప్రముఖుల సహకారంతో 263 ఎకరాల విస్తీర్ణంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రారంభమైంది. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులతో కళాశాలలో తరగతులు ప్రారంభమయ్యాయి. 1979లో బీఎస్సీ ఫారెస్ట్రీ, బీఎస్సీ ఫిషరీష్, బీఎస్సీ డెయిరీ, బీఏ రూరల్ ఇండస్ట్రీ వంటి కోర్సులను చేర్చారు. ఇప్పుడు కాలేజీలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో వివిధ కోర్సులు కొనసాగుతున్నాయి. ఇక్కడ ఉన్న డెయిరీ కోర్సు పీవీ నర్సింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలోకి వెళ్లింది. దీంతో డెయిరీ కోర్సుల కోసం ప్రత్యేక కాలేజీ ఏర్పాటైంది. ఎంసెట్ ద్వారా బీటెక్ డెయిరీలో ప్రవేశం కల్పిస్తున్నారు. ఆరు దశాబ్దాల కాలంలో దాదాపు యాభై వేల మందికిపైగా విద్యార్థులకు బతుకు పాఠాలు నేర్పిందీ కళాశాల. ఇటీవలి కాలంలో కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల నుంచి ఎంత పోటీ ఎదురైనా ఎక్కడా వెనకబడలేదు. కళాశాల ఏర్పాటైన నాటి నుంచి నేటి దాకా తన సత్తా చాటుతూనే ఉంది. ఇక్కడ చదివిన వారు ఎంతోమంది ఉన్నత స్థానాలకు ఎదిగారు. దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో పనిచేస్తున్నారు. అలాగే దేశంలో అత్యున్నతమైన సివిల్ సర్వీసెస్‌లో కూడా చాలామంది ఉండడం విశేషం. వీటితో పాటు వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, రాజకీయ రంగాల్లోనూ సత్తాచాటుతున్నారు.





ఎన్.సత్యనారాయణ, రెరా చైర్మన్



చంద్రశేఖర్‌రెడ్డి, చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్



శివకుమార్, చంచల్‌గూడ జైల్ సూపరింటెండెంట్

ఉన్నత స్థానాలకు పలువురు..

కామారెడ్డి డిగ్రీ కళాశాల స్థాపించి ఆరు దశాబ్దాలు గడిచాయి. ఈ కాలంలో యాభై వేల మందికిపైగా విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగారు. పలువురు రాష్ట్రంలో కీలక రంగాల్లో పనిచేశారు. ఇప్పటికీ ఎంతో మంది వివిధ శాఖల్లో కీలక హోదాల్లో ఉన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లోనూ ఉద్యోగాలు చేస్తున్నారు. విదేశాల్లో సైతం చాలామంది ఉన్నత స్థానాలలో ఉన్నారు. తెలంగాణ స్టేట్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా ఇటీవలే నియమితులైన రిటైర్డ్ ఐఎఫ్ఎస్ ఆఫీసర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి డిగ్రీ విద్యను కామారెడ్డి కళాశాలలోనే పూర్తి చేశారు. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) చైర్మన్‌గా పనిచేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ ఎన్.సత్యనారాయణ కూడా ఈ కాలేజీలోనే చదివారు. చంచల్‌గూడా జైల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నవాబ్ శివకుమార్‌గౌడ్ ఇక్కడి విద్యార్థే.. అటవీ శాఖలో కీలక స్థానంలో పనిచేస్తున్న ఐఎఫ్ఎస్ అధికారి ప్రభాకర్, మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్ విభాగంలో నాగపూర్ రీజినల్ ఆఫీస్‌లో అడిషనల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సైంటిస్ట్ డాక్టర్ సురేందర్ గుగులోత్, స్టేట్ ఆడిట్ డిపార్టుమెంట్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న పరశురాం, ఐఎఫ్ఎస్ అధికారి కిష్టాగౌడ్, సీఎం కార్యాలయలో అసిస్టెంట్ సెక్రెటరి లింగమూర్తి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరి, అదనపు ఎస్పీ రామేశ్వర్ కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలోనే డిగ్రీ పూర్తి చేశారు. సంగారెడ్డి జిల్లా అటవీ అధికారి శ్రీధర్ రావు, పోలీస్ ఉన్నతాధికారిగా పనిచేసి పదవీ విరమణ పొందిన ఐపీఎస్ అధికారి వెంకటేశ్వర్‌రావు ఇక్కడే చదివారు. ఐఆర్ఎస్ అధికారి రఘు నర్సింహాచారి, జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ రాజేందర్, అదనపు కలెక్టర్‌గా పనిచేసిన రాంకిషన్, ఆర్డీవోలుగా పనిచేసిన రాజేశ్వర్, ముత్యంరెడ్డి, తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా పనిచేస్తున్న కే.భాస్కర్‌రెడ్డి ఈ కళాశాల పూర్వ విద్యార్థులే. దొడ్ల డెయిరీ, జెర్సీ డెయిరీ వంటి కంపెనీల్లో మేనేజింగ్ డైరెక్టర్లు, డైరెక్టర్లుగా, ఇతర కీలక స్థానాల్లో ఉన్నవారంతా కామారెడ్డి కాలేజీ విద్యార్థులే కావడం గమనార్హం.

చివరి రోజు ఒకే ఒక్కటి..

- ముగిసిన ఎల్ఆర్ఎస్ గడువు
- నాలుగో విడతలో స్పందించింది 28 మందే..



కామారెడ్డి టౌన్: అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్) గడువు శనివారంతో ముగిసింది. జిల్లాలోని మూడు బల్దియాల పరిధిలో చివరి రోజు ఒకేఒక్కరు లేఅవుట్ ఫీజు చెల్లించారు. కాగా ఇప్పటివరకు మూడు బల్దియాల పరిధిలో కలిపి 5,194 మంది ఫీజు చెల్లించారు. మొదటి మూడు విడతల్లో 5,166 మంది దరఖాస్తుదారులు స్పందించగా.. చివరి విడతలో స్పందించింది 28 మందే కావడం గమనార్హం.

పావుశాతమే స్పందన..

ఎల్ఆర్ఎస్-2020 స్కీం కింద జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలలో 20,500 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిష్కరించేందుకోసం ప్రభుత్వం ఈనెల ఫిబ్రవరిలో 25 శాతం ఫీజు రాయితీతో అవకాశం కల్పించింది. దరఖాస్తుదారులు ఫీజు చెల్లించేందుకు ముందుకు రాకపోవడంతో ఇప్పటికే నాలుగుసార్లు గడువు పొడిగించారు. నాలుగోసారి గడువు కూడా మే 31 సాయంత్రంతో ముగిసింది. గడువు ముగిసే వరకు 5,194 మంది దరఖాస్తుదారులు మాత్రమే స్పందించి ఫీజు చెల్లించారు. ఇప్పటివరకు నాలుగుసార్లు గడువు పొడిగించినా దరఖాస్తుదారుల నుంచి అంతంతమాత్రమే స్పందన వచ్చింది. నాలుగు విడతల్లో కలిపి పాతిక శాతమే స్పందించడం గమనార్హం. కాగా ఎల్ఆర్ఎస్ ఫీజు ద్వారా కామారెడ్డి బల్దియాకు రూ. 10.96 కోట్లు, ఎల్లారెడ్డికి రూ. 38 లక్షలు, బాన్సువాడకు రూ. 92 లక్షల ఆదాయం సమకూరింది.

సదస్సులను పారదర్శకంగా నిర్వహించాలి

కామారెడ్డి క్రైం: భూభారతి రెవెన్యూ సదస్సులను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లతో భూ భారతిలో సమస్యల పరిష్కారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 3 వ తేదీనుంచి 20 వ తేదీ వరకు అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. భూ భారతి సదస్సుల నిర్వహణపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ఒకరోజు ముందుగానే దరఖాస్తు ఫారాలను పంపిణీ చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి ఆయా దరఖాస్తులపై విచారణ జరపాలన్నారు. బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూభారతి చట్టంపై అధికారులకు అవగాహన కల్పించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, కామారెడ్డి ఆర్డీవో వీణ, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'అధికారుల సేవలు విలువైనవి'

కామారెడ్డి క్రైం : పదవీ విరమణ పొందిన అధికారులు ఇంతకాలం అందించిన సేవలు ఎంతో విలువైనవని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. జిల్లాలో పనిచేస్తున్న డీపీఆర్‌వో భీం కుమార్, ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ జయంత్‌రెడ్డి, దోమకొండ తహసీల్దార్ సంజయ్‌రావు శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ కింది స్థాయి నుంచి ఉద్యోగ జీవితాలను ప్రారంభించి 30 ఏళ్లకుపైగా సేవలందించడం గొప్ప విషయమన్నారు. అనంతరం కలెక్టర్ వారిని సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, కామారెడ్డి ఆర్డీవో వీణ తదితరులు పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన అధికారులతో కలెక్టర్ సంగ్వాన్, అధికారులు

భూభారతితో ప్రయోజనం!

- భూ సమస్యలకు పరిష్కారం
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

లింగంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతోంది. ఏళ్లుగా పరిష్కారం కాని పలు భూ సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయి. దీంతో రైతుల్లో ఆనందం కనిపిస్తోంది.

గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అమలులోకి తెచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ పోర్టల్‌లో తప్పిదాలు చోటు చేసుకున్నాయి. పోర్టల్‌లో సర్వే నంబర్లు తప్పుగా నమోదు కావడం, ఆన్‌లైన్‌లో పట్టా భూమి నమోదు కాకపోవడం, ఒకరి భూమి మరొకరి పేరుపై రావడం, పేర్లు తప్పుగా నమోదు కావడం, పాసుబుక్కులో ఉన్న భూమి ఆన్‌లైన్‌లో రాకపోవడం, తదితర తప్పులు దొర్లాయి. దీంతో జిల్లాలో వేలాది మంది రైతులు ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఏళ్ల తరబడిగా తహసీల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదు. ధరణిలో మాడ్యూల్స్ లేకపోవడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు.

లింగంపేట మండలంలో..

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక ఇటీవల ధరణిని రద్దు చేసి, భూభారతి చట్టం తీసుకువచ్చింది. దీనిని పైలట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో అమలు చేసింది. అందులో లింగంపేట మండలం ఒకటి. అధికారులు ఏప్రిల్‌లో మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో భూభారతి సదస్సులు నిర్వహించి, బాధిత రైతులనుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం వాటిని పరిష్కరించేందుకు తొమ్మిది సర్వే బృందాలను ఏర్పాటు చేశారు. ఆయా బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ దరఖాస్తులను పరిష్కరిస్తున్నాయి. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, భూభారతి ప్రత్యేకాధికారి రాజేందర్‌తోపాటు ఇతర రెవెన్యూ అధికారులు 40 రోజులపాటు శ్రమించి పలు భూ సమస్యలకు పరిష్కారం చూపారు. ఏళ్లుగా పట్టా పాసుపుస్తకాల్లో నమోదు కాని వ్యవసాయ భూముల వివరాలు భూభారతి ద్వారా రైతుల పాసు పుస్తకాల్లో నమోదు చేస్తున్నారు. మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి 4,225 దరఖాస్తులు రాగా అందులో వెయ్యి సమస్యలను పరిష్కరించినట్లు అధికారులు తెలిపారు. సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ఆయా రైతులకు పట్టా పాసుపుస్తకాలు అందజేస్తామన్నారు.



ముంబోజీపేటలో క్షేత్రస్థాయిలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్ (ఫైల్)

న్యాయం జరిగింది



నాకు గ్రామ శివారులో 681/1 సర్వే నంబరులో మూడు గుంటలు, 688/ఇ/1లో 22.50 గుంటల భూమి ఉంది. అవి ధరణి పోర్టల్ ద్వారా వచ్చిన పట్టా పాసుబుక్‌లో నమోదు కాలేదు. దీంతో రైతుబంధు రాలేదు. తహసీల్ ఆఫీసు చుట్టూ తిరిగినా పనికాలేదు. ఇటీవల రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకున్నా. అధికారులు సర్వే చేసి నా భూమి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

– కొర్పోత్ సత్తవ్వ, రైతు, పొల్కంపేట

పేరు సరిచేశారు



ధరణి పోర్టల్ ద్వారా వచ్చిన పట్టా పాసుబుక్కులో నా పేరు తప్పుగా నమోదైంది. దీంతో ప్రభుత్వ పథకాలకు దూరమయ్యా. పేరు సరిచేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. నెల రోజుల క్రితం మా గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో దరఖాస్తు చేసుకున్నా. అధికారులు గ్రామానికి వచ్చి విచారణ చేసి భూభారతి పథకం ద్వారా ఆన్‌లైన్‌లో పేరు సరిచేశారు.

– ఆవుల రాములు రైతు, మోతె

క్షుణ్ణంగా పరిశీలించి..



23 రెవెన్యూ గ్రామాల నుంచి వచ్చిన భూ సమస్యల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాం. రైతుల సాదాబైనామాలు, మిస్సింగ్ సర్వే నంబర్లు, పేర్లు తప్పుగా నమోదైనవి, ఆన్‌లైన్‌లో భూమి నమో దు కాని తదితర సమస్యలను పరిష్కరించాం. అస్సైన్డ్, రెవెన్యూ, అటవీ శాఖల భూముల సమస్యలను సర్వే చేపట్టి పరిష్కరిస్తాం. కోర్టు కేసులు ఉన్న భూముల విషయంలో రెవెన్యూ చట్టం ప్రకారం ముందుకువెళ్తాం.

– సురేష్, తహసీల్దార్, లింగంపేట

విధి నిర్వహణ సాహసమే..



మోషంపూర్‌లో స్తంభం ఎక్కి పనులు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

రామారెడ్డి: విద్యుత్ శాఖ సిబ్బంది విధి నిర్వహణలో సాహసాలు చేయాల్సి వస్తోంది. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని సేవలందిస్తున్నారు. శనివారం రామారెడ్డి మండలం మోషంపూర్ గ్రామంలో సిబ్బంది లైన్లను సరిచేశారు. అలాగే కన్నాపూర్‌లో శుక్రవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో రాత్రి పూట 5 గంటల పాటు శ్రమించి ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేశామని ఏఈ నరసింహ తెలిపారు.



రామారెడ్డిలో..

క్లుప్తంగా

మహిళను రక్షించిన పోలీసులు



పారిజాతంను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న పోలీసు సిబ్బంది

రాజంపేట: మతిస్థిమితం లేని మహిళను సురక్షితంగా వారి కుటుంబసభ్యులకు రాజంపేట పోలీసు సిబ్బంది అప్పగించారు. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నామ పారిజాతం అనే మహిళ కుటుంబ సమస్యలతో మానసిక స్థిరత్వం కోల్పోయి, ఆర్టీసీ బస్సులో నల్గొండ జిల్లా చిట్యాల నుంచి కామారెడ్డి జిల్లా పరిధిలోని ఆరేపల్లికి చేరుకుంది. అనుమానాస్పదంగా తిరుగుతున్నట్టు గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.స్పందించిన హెడ్ కానిస్టేబుల్ బాలరాజు, కానిస్టేబుళ్లు చిరంజీవి, చరణ్, ప్రేమ్‌సింగ్ ఆ మహిళతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.ఆమె వద్ద ఉన్న ఆధార్ కార్డు ద్వారా కుటుంబసభ్యులను పిలిపించి శుక్రవారం ఆమెను సురక్షితంగా అప్పగించారు. సిబ్బంది పనితీరును ఎస్సై ప్రశంసించారు.

జుక్కల్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి

పిట్లం(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుకు మంత్రి పదవి ఇవ్వాలని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్రోజ్ పేర్కొన్నారు. ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణలో జుక్కల్ నియోజకవర్గానికి, నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావుకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ హైకమాండ్‌ను విజ్ఞప్తి చేశారు.

బడిబాటను విజయవంతం చేయాలి



బాన్సువాడ రూరల్: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోనాపూర్ మాజీ సర్పంచ్ వెంకట రమణారావు కోరారు. శనివారం కోనాపూర్ పంచాయతి కార్యాలయంలో నిర్వహించిన బడిబాట సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 6 నుంచి ప్రారంభం కానున్న బడిబాట కార్యక్రమంలో బడీడు పిల్లలను బడిలో చేరేలా స్థానిక యువకులు, మహిళా సంఘాల ప్రతినిధులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి భరత్‌కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ విఠవ్వ, కటిక మోతీరామ్, డాకయ్య, పాపయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

గోసంరక్షణ చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని కల్యాణి గ్రామంలో గోసంరక్షణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు శనివారం పంచాయతీ కార్యదర్శి సుధాగౌడ్‌కు వినతిపత్రం ఇచ్చారు. గ్రామంలో గోసంరక్షణకు సంబంధించి తగిన చర్యలను తీసుకోవాలని వారు కార్యదర్శిని కోరారు.

గ్రామాల్లో పారిశుధ్య పనుల పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి, అయ్యపల్లి, అయ్యపల్లి తండాల్లో శనివారం ఎంపీవో మలహరి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కురుస్తున్న వర్షాలకు మురికి కాల్వల్లో పూడిక పేరుకుపోయింది. పిచ్చి మొక్కలు వీధుల్లో పెరగడంతో గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులతో తొలగించారు. అలాగే గ్రామాల్లో వర్షం నీరు నిల్వకుండా చూడాలని గ్రామ పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. జీపీ కార్యదర్శులు ఉన్నారు.

ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి

- శాంతిభద్రతలకు భంగం కలిగించొద్దు
- డీఎస్పీలు విఠల్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు

బాన్సువాడ : పండుగలను ప్రశాంత వాతవారణంలో జరుపుకోవాలని బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి అన్నారు.శనివారం డీఎస్పీ కార్యాలయంలో ఆయన శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. పండుగలను అందరు కలిసిమెలిసి జరుపుకోవాలన్నారు. బక్రీద్ పండుగ పురస్కరించుకుని గోవధ జరుగకుండా చూడాలన్నారు. పండుగను సంతోషంగా జరుపుకోవాలని, శాంతిభద్రతలకు భంగం కలిగించవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ అశోక్, నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ విఠల్‌రెడ్డి

ఎల్లారెడ్డి: పండగలను ప్రశాంత, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి గొడవలు జరగకుండా అందరు కలిసి మెలిసి పండగను జరుపుకోవాలని సూచించారు.కార్యక్రమంలో సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేష్ తదితరులున్నారు.



ఎల్లారెడ్డిలో .. డీఎస్పీ శ్రీనివాస్‌రావు

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

- ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బక్రీద్ నేపథ్యంలో జిల్లా నుండి వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ సూచించారు. జిల్లా సరిహద్దులో గల నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక చెక్‌పోస్ట్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్‌లో వాహనాల తనిఖీకి సంబంధించి నిర్వహిస్తున్న రిజిస్టర్‌ను ఆయన పరిశీలించారు. దీంతోపాటు చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెక్‌పోస్ట్ నుంచి వెళ్లే ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి అక్రమ గోవుల రవాణాను అరికట్టాలన్నారు. దీంతోపాటు వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను చెల్లించుకునేలా చర్యలు చేపట్టాలని ఆయన చెప్పారు. వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించేలా చూడాలని ఆయన ఆదేశించారు. ఆయనవెంట నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి తదితరులున్నారు.



పోచారం చెక్‌పోస్ట్ వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ రవీందర్‌నాయక్



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న ఎస్సై మహేశ్

ఎల్లారెడ్డి: పట్టణంలో పోలీసులు శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఎస్సై మహేశ్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. సరియైన ధృవపత్రాలు లేకుండా వాహనాలను నడపవద్దని వాహనదారులకు సూచించారు. బక్రీద్ పండగ సందర్భంగా అక్రమంగా జంతువులను రవాణా చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

అహల్యాబాయిని ఆదర్శంగా తీసుకోవాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

కామారెడ్డి టౌన్: జిల్లాకేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో శనివారం అహల్యాబాయి హోల్కర్ 300 వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఆమె జీవిత చరిత్రపై రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు నిలువెత్తు దర్పణంగా అహల్యాదేవి నిలిచిందన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, ప్రధాన కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, నాయకులు అనిత, హారిక, బాలమణి, తదితరులు పాల్గొన్నారు.



తడిహిప్పర్గాలో విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ ఎంపీ బీబీ పాటిల్

అహల్యాబాయి విగ్రహావిష్కరణ

మద్నూర్(జుక్కల్): మండలంలోని తడిహిప్పర్గా గ్రామంలో అహల్యాబాయి విగ్రహాన్ని మాజీ ఎంపీ బీబీపాటిల్ ఆవిష్కరించారు. విగ్రహదాతగా వ్యవహరించిన ఆయన గ్రామస్తులతో కలిసి అహిల్యాబాయి విగ్రహానికి పూజలు నిర్వహించారు. అహిల్యాబాయి బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని మాజీ ఎంపీ సూచించారు. అలాగే మండల కేంద్రంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో జై మల్హార్ అహల్యాబాయి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. హట్కర్ సమాజ్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గంగారం, హట్కర్ సమాజ్ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పర్మళ్ల తండాలో శుక్రవారం రాత్రి బాల్య వివాహాన్ని అడ్డుకున్నట్లు ప్రొబెషనరీ ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. తండాకు చెందిన అమ్మాయి, కన్నాపూర్ తండాకు చెందిన అబ్బాయితో శుక్రవారం పెళ్లి జరుగుతోంది. అమ్మాయి మేజర్ కాగా, అబ్బాయి వయస్సు 20. అబ్బాయి మైనర్ కావడంతో పోలీసులు పర్మళ్ల తండాకు చేరుకొని బాల్య వివాహం నేరమని పెద్దలకు సూచించారు. చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు పర్మళ్ల తండాకు చేరుకునేలోపే అమ్మాయి, అబ్బాయిని అక్కడి నుంచి తప్పించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు అప్పగిస్తామని ఎస్సై తెలిపారు.

గుంతలో పడ్డ ఆవు

- బిచ్కుంద బస్టాండ్ చుట్టూ గుంతలు తవ్వి వదిలేసిన ఆర్టీసీ అధికారులు
- ప్రమాదకరంగా మారుతున్న వైనం



గుంతలో పడ్డ ఆవు

బిచ్కుంద: బిచ్కుంద ఆర్టీసీ బస్టాండ్ స్థలం ఆక్రమించొద్దని వారం రోజుల క్రితం ఆర్టీసీ అధికారులు బస్టాండ్ చుట్టూ తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారాయి. శుక్రవారం రాత్రి ఆవు ప్రమాదవశాత్తు గుంతలో పడిపోయింది. బయటకు రాకుండా రాత్రంతా అందులోనే ఉండిపోయింది. శనివారం ఉదయం 9 గంటలకు ఆవు అరుపులు వినపడటంతో స్థానికులు వెళ్లి చూడగా గుంతలో ఆవు పడి ఉంది. వెంటనే స్థానికులు జేసీబీ సహాయంతో ఆవును బయటకు తీశారు. కాళ్లు, శరీరం పై గాయాలు కావడంతో వెటర్నరీ వైద్యుడిని అక్కడే పిలిపించి చికిత్స చేయించారు. వెంటనే గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని గుండెనెమ్లి గ్రామానికి చెందిన గడ్డి బాలబోయి(48) శుక్రవారం మంజీరలో చేపల వేటకు వెళ్లి మృతి చెందాడని ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో శనివారం భార్య బందెవ్వ మంజీరకు వెళ్లి చూడగా బాలబోయి మృతదేహం నీటిలో తేలియాడుతూ కనిపించింది. చేపల వల కాళ్లకు చుట్టుకోవడంతో నీట మునిగి చనిపోయినట్లు తెలిపారు. పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశామన్నారు.

జీజీహెచ్‌లో గుర్తు తెలియని మహిళ..

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు ఒకటో టౌన్ ఎస్సై రఘుపతి శనివారం తెలిపారు. నగరంలోని దేవీరోడ్‌లో గుర్తు తెలియని మహిళ అపస్మారక స్థితిలో ఉండడాన్ని గమనించిన స్థానికులు డయల్ 100కు కాల్ చేయగా, ఘటనా స్థలానికి చేరుకున్న టౌన్ 1 బ్లూకోల్ట్ సిబ్బంది ఆ మహిళను గురువారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మహిళ మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి వయసు సుమారు 40 వరకు ఉంటుందని, వంకాయ కలర్ చీర, నీలి రంగు జాకెట్ ధరించి ఉందన్నారు. మహిళ సమాచారం ఎవరికైనా తెలిస్తే వన్‌టౌన్‌లో సంప్రదించాలని సూచించారు.



మహిళ మృతదేహం

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలోని రాకాసీపేట్ పరిధిలోని లయన్స్ కంటి ఆస్పత్రి వెనుక ఉన్న దర్గా సమీపంలో పేకాటస్థావరంపై శనివారం దాడి చేసినట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. ఐదుగురిని పట్టుకొని, వారి నుంచి రూ. 1,970 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

38 పశువుల పట్టివేత

భిక్కనూరు: అక్రమంగా తరలిస్తున్న 38 పశువులను పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం సాటాపూర్ గ్రామం నుంచి 12 లేగదూడలు, 26 ఎడ్లను బోలెరో, డీసీఎం వ్యాన్‌లలో మెదక్ జిల్లా నార్సింగి గ్రామంలోని మార్కెట్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తుండగా జాతీయ రహదారిపై పట్టుకున్నామన్నారు. పశువులను జంగంపల్లి శ్రీ క్రిష్ణ మందిరంలోని గోశాలకు తరలించామన్నారు. డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు.

కోనేరులో జారిపడి ఒకరు..

రామారెడ్డి: ప్రమాదవశాత్తు కోనేరులో జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన రామారెడ్డి మండలం మద్దికుంటలో శనివారం చోటు చేసుకుంది. ప్రొబెషనరీ ఎస్సై నవీన్‌చంద్ర తెలిపిన వివరాల ప్ర కారం.. మద్దికుంటకు చెందిన ఓరుగంటి గంగయ్య(50) తన భార్య 20 సంవత్సరాల క్రితం వెళ్లగా అప్పటి నుంచి ఒంటరిగా నివసిస్తున్నాడు. వృద్ధాప్యం కారణంగా ఇటీవలే మద్దికుంట వృద్ధాశ్రమానికి వచ్చాడు. బుగ్గ కోనేరులో శనివారం స్నానం చేసేందుకు వెళుతుండగా, ప్రమాదవశాత్తు నీటిలో జారిపడి మృతి చెందాడు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, భార్య ఓరుగంటి బాలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పీఎస్సై తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చేపూర్‌లో ఒకరు..


ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామ శివారులో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి గుడి వద్ద కురాకుల మురళి(63) మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. భీమ్‌గల్ మండలం ముచ్కూర్ గ్రామానికి చెందిన మురళి కొద్దిరోజుల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. అప్పుడప్పుడు వీరబ్రహ్మేంద్రస్వామి గుడికి వస్తుంటాడు. శుక్రవారం రాత్రి సైతం గుడికి వస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రశేఖర్ కాలనీకి చెందిన సంతోష్(37) ఆర్థిక ఇబ్బందులతో శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రొబెషనరీ ఎస్సై శైలేందర్ తెలిపారు. చంద్రశేఖర్ కాలనీ చెందిన సంతోష్‌కు అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కవల పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కామారెడ్డిలో యువకుడు అదృశ్యం

కామారెడ్డి క్రైం: నిజామాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి కామారెడ్డిలో అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌లోని గంగస్థాన్‌కు చెందిన వెంట్రామొల్ల సాహిత్ కుమార్ ప్రైవేటు కంపెనీలో సేల్స్‌మన్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం కామారెడ్డికి వచ్చిన సాహిత్ కుమార్ సాయంత్రం దేవునిపల్లి ప్రాంతంలో పోలీసులకు డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. అనంతరం స్నేహితుడు భరత్‌కుమార్ అతడిని బస్టాండ్‌కు తీసుకువచ్చి నిజామాబాద్ బస్సు ఎక్కించాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతోపాటు ఇంటికి చేరకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు శనివారం సాయంత్రం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.



సాహిత్ కుమార్

కత్తితో పొడుచుకొని ఆత్మహత్యాయత్నం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని గాజులపేట్ ప్రాంతంలో గురుద్వార్ వద్ద ఖాజా మొయినుద్దీన్(60) జీవితంపై విరక్తితో శనివారం రాత్రి తనకు తాను కత్తితో పొడుచుకున్నాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో క్షతగాత్రుడిని జీజీహెచ్‌కు తరలించారు. తక్షణమే స్పందించిన 108 ఈఎంటీ రాములు, పైలెట్ అజయ్‌ని స్థానికులు అభినందించారు.

మీకు తెలుసా?

బినోలాలో వాల్మీకి సమాధి



బినోలా గ్రామంలోని వాల్మీకి సమాధి

మానవజాతికి రామాయణ సందేశం బహుముఖం. దేశ కాలాతీతమైన, ప్రకాశవంతమైన కార్యసృష్టి చేసిన వాల్మీకి చరితార్థుడు. ఆ మహర్షి చివరి గడియలను మన జిల్లాలోనే గడిపారనే విషయం ఎంతమందికి తెలుసు. అందుకు సాక్ష్యమే నవీపేట మండలం బినోలా గ్రామంలోని సమాధి.

- గ్రామానికి ప్రారంభంలోనే చెరువు కట్ట పక్కన ఈ సమాధి ఉంది. సమాధికి వినియోగించిన రాళ్లపై రాతలు(లిపి) ఉన్నాయి.
- మహర్షిగా మారకముందు వాల్మీకి బినోలా శివారులోని గోదావరి పరీవాహక ప్రాంతంలో పక్షులను వేటాడేవారని, సప్తరుషులు ఒకరోజు ప్రత్యక్షమై ఆయనకు హితబోధ చేసినట్లు పురాణాలు చెబుతున్నాయి.
- అప్పటి నుంచి మహర్షిగా మారి ఇదే ప్రాంతంలో శిష్యులకు బోధనలు చేశారు. గోదావరిలో స్నానమాచరించి గ్రామంలోని దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు చేసేవారు.
- పవిత్ర కాశీలో ఉన్న ఆలయాలు.. బినోలాలో కూడా ఉన్నట్లు వేద పండితులు చెబుతారు.

– నవీపేట్

అటెన్షన్ ప్లీజ్.. డ్రెయినేజీని తలపిస్తున్న నీటి తొట్టెలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : పశువుల నీటితొట్టె నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదు. నీటితొట్టెలు డ్రెయినేజీలను తలపిస్తున్నాయి. మండలంలోని అంకోల్ తండా, అంకోల్ గ్రామాల్లో గల నీటి తొట్టెలో నాచు పట్టి, మట్టి తో నిండి ఉంది. సంబంధిత అధికారులు పట్టించుకోని నీటి తొట్టెలను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అంకోల్ తండాలో ఉన్న నీటి తొట్టె

మిషన్ భగీరథ నీరు మురికికాలువలోకి..



కామారెడ్డి అర్బన్: మున్సిపల్ కార్యాలయానికి సమీపంలో సబ్‌జైల్ రోడ్డు పక్కన ఎయిర్ వాల్వ్ ద్వారా వృథాగా పోయే నీటిని మురికి కాల్వలోకి మళ్లించారు. తీవ్ర నీటి కొరత ఉన్న కామారెడ్డిలో ఇలా వృథాగా మురికి కాలువలోకి మంచి నీరు వెళ్లడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సంపు నిర్మించి వృధాను అరికట్టవచ్చని, తీవ్ర నీటికొరతను ఎదుర్కొంటున్న ప్రభుత్వ ఆస్పత్రి, కొత్త బస్టాండ్ మరుగుదొడ్లకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయవచ్చని స్థానికులు సూచిస్తున్నారు.

అర్హులు ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించుకోవాలి



ఇబ్రహీంపేట్‌లో ఇంటి ప్రొసీడింగ్స్ పంపిణీ చేస్తున్న నాయకులు

బాన్సువాడ రూరల్: అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించుకోవాలని బాన్సువాడ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజవ్వ గణేశ్ అన్నారు. శనివారం ఇబ్రహీంపేట్‌లో గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాలెపు వెంకట్‌రెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేసి మాట్లాడారు. తాడ్కోల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, గంగుల గంగారాం తదితరులు లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. బోర్లం క్యాంపు గ్రామంలో లబ్ధిదారుల ఖాళీ స్థలాల్లో పంచాయతీ కార్యదర్శి పరిపూర్ణ, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి ముగ్గుపోసి భూమిపూజ చేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

బీబీపేట/నిజాంసాగర్ : ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని బీబీపేట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుతారి రమేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ లబ్ధిదారులకు సూచించారు. శనివారం జుక్కల్ మండలం దోస్త్ పల్లి గ్రామంలో మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను పున: పరిశీలించాలి

కామారెడ్డి టౌన్: విద్యాశాఖ తాజాగా జారీ చేసిన ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను పునః పరిశీలన చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్షులు పుల్లం రాఘవరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే ప్రాథమిక పాఠశాలలో ప్రతీ తరగతికి ఉపాధ్యాయుడు ఉండేలా ప్రభుత్వం ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భూనేకర్ సంతోష్ కుమార్, రాష్ట్ర బాధ్యులు రమేష్ కుమార్, జిల్లా బాధ్యులు సంగమేశ్వర గౌడ్, స్వామి, గిరి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీటీయూ, డీటీఎఫ్ ఆధ్వర్యంలో..

కామారెడ్డి అర్బన్: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రాథమిక విద్యకు గొడ్డలిపెట్టులాంటిదని, ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్)లు డిమాండ్ చేశాయి. టీటీయూ,డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ ముజీబొద్దీన్, కాంబ్లే గోపాల్, దేవులా, ఎన్సీ ప్రభాకర్‌లు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.



మాట్లాడుతున్న పుల్లం రాఘవరెడ్డి

యువజన కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల కాంగ్రెస్ పార్టీ యువజన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్ తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఆదేశాల మేరకు యువజన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా బుర్ర రామకృష్ణగౌడ్, కార్యదర్శులుగా రాందాస్, రాజేశ్వర్‌గౌడ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అలాగే పోలకంపేట అధ్యక్షుడుగా చాకలి కుమార్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నవీన్, అజయ్‌గౌడ్, ఎన్నికైన సభ్యులు తదితరులున్నారు.

కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డవారికి తప్పనిసరిగా మంచి గుర్తింపు లభిస్తుందని పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. తాడ్వాయి మండలంలోని చిట్యాల గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్టీ గ్రామకమిటీని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షుడిగా మ్యాడం బాలయ్యతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, ఎస్సీసెల్ నియోజక వర్గం అధ్యక్షుడు శివాజీ, నాయకులు లక్ష్మణచారీ, రాజీవ్‌కుమార్, షౌకత్‌అలీ, శ్యాంరావు, అఖిల్‌రావు, పులిబాబు, కిషన్‌రావు, విఠల్, యెల్లాగౌడ్, ప్రభాకర్ పాల్గొన్నారు.



ఎన్నికైన లింగంపేట యువజన కాంగ్రెస్ కమిటీ

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

తాడ్వాయి/ రాజంపేట/ నిజాంసాగర్: నిత్యం యోగాసనాలు చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని యోగాశిక్షకులు అన్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్‌లోని సీహెచ్‌సీలో, రాజంపేట మండలం ఆర్గొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, జుక్కల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని చేపట్టారు. కార్యక్రమాల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్గొండ పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు